




అధికారులు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో ఓటరు నాడి మారింది. అందుకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ప్రజలు పార్టీల వైపు చూసిన తీరు నిదర్శనంగా కనిపిస్తోంది. హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల సమరంలో ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు చేజారటంతో కేడర్‌లో ఆందోళన కనిపిస్తోంది. ఓ వైపు మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. మరో వైపు బీజేపీ అభ్యర్థి సొంత నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యం సాధించడం లాంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. పట్టణ ఓటర్లు బీజేపీ వైపే మొగ్గు చూపగా.. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌కు జై కొట్టారు. అలాగే మూడు పర్యాయాలు వరుసగా గెలిచి వరంగల్‌ను కంచుకోటగా మార్చుకున్న బీఆర్ఎస్ ఈసారి తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంది. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలవగా, మిగిలిన ఐదు చోట్ల మూడో స్థానానికి దిగజారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్







'లోక్‌సభ' పరీక్షలో మంత్రులు ఫెయిల్!


- ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు
- మెదక్‌లో కొండా సురేఖ, ఆదిలాబాద్‌లో సీతక్క, కరీంనగర్‌కు పొన్నం, పెద్దపల్లిలో దుద్దిళ్ల..
- శ్రీధర్‌బాబు మినహా ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి

వివరాలు : 7లో..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

- వరంగల్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు తగ్గిన ఓటు బ్యాంకు
- అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభకు 80వేల పైచిలుకు ఓట్ల వ్యత్యాసం
- వరంగల్ తూర్పులో మంత్రి కొండాకు షాక్.. బీజేపీకి జై కొట్టిన జనం
- కమలం వైపు చూసిన అర్బన్ ఓటర్లు
- బీజేపీ అభ్యర్థి అరూరి సొంత సెగ్మెంట్‌లో హస్తానికి ఆధిక్యం
- కంచుకోటలో మూడోస్థానానికి పరిమితమైన 'గులాబీ' పార్టీ
- పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఐదు నియోజకవర్గాల్లో మూడోస్థానం
- వరంగల్ అర్బన్‌లో మరీ దారుణం.. 20వేల ఓట్లకే పరిమితం

7





6

మానుకోటలో కాంగ్రెస్ జోష్

- లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం
- ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో..	ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
	2023 అసెంబ్లీ	6,63,556	1,56,638	5,03,298
	లోక్‌సభ	5,81,294	3,60,955	2,32,033

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో..	ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
	2023 అసెంబ్లీ	6,85,897	34,431	4,43,910
	లోక్‌సభ	6,12,774	1,10,444	2,63,609

'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

- ప్రారంభమైన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు
- నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ
- మొత్తం 96టేబుళ్ల ఏర్పాటు.. ఒక్కో టేబుల్‌లో వెయ్యి ఓట్ల లెక్కింపు
- ప్రతీ రౌండ్‌లో 96వేల ఓట్ల కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రం వద్ద తీన్మార్ మల్లన్న, రాకేష్ రెడ్డి కరచాలనం

నల్లగొండ, జూన్ 5: పార్లమెంట్ ఫలితాలు రావడంతో.. ఇక అందరి దృష్టి వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపై పడింది. ఈ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో భాగంగా గత నెల 27న బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరగ్గా.. పట్టభద్రులు ఏ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టబోతున్నారా అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. మొత్తం 52మంది అభ్యర్థులు పోటీ చేయగా.. 4.63లక్షల ఓట్లకు గాను 3.36లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల్లో ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షణలో లెక్కింపును ప్రారంభించిన అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు 25బ్యాలెట్ల చొప్పున బండిల్స్‌ను కట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం 96టేబుళ్లను ఏర్పాటు చేసి.. ఒక్కో టేబుల్‌పై 1000ఓట్ల లెక్కన, ప్రతీ రౌండ్‌లోను 96వేల ఓట్లను కౌంట్ చేయనున్నారు. అయితే నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. అర్ధరాత్రి దాటిన తరువాతే తొలి ప్రాధాన్యత ఓట్లపై స్పష్టత రానుంది. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లద్వారా ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు, అప్పటికీ ఫలితంపై స్పష్టత రాకపోతే మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇక విజేత ఎవరనేది తేలడానికి రెండు రోజుల సమయం పట్టనుంది. ఎస్పీ చందన దీప్తి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీస్‌శాఖలోని అన్ని ర్యాంకులకు చెందిన 800మంది సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాళ్ల వద్ద డీఎస్పీ ర్యాంకు అధికారులు బందోబస్తును పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో పాటు ఇతర అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండి సరళిని తెలుసుకుంటున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అధికారులను సంప్రదించాలి

- డీఈ పెరుమాళ్లపెల్లి విజయ్

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 : మహబూబాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత సెక్షన్ కార్యాలయం చెందిన అధికారులను సంప్రదించాలని విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ పెరుమాళ్లపెల్లి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడీఈ ఆర్.శ్రీనివాస్ సెల్:9440811334, మహబూబాబాద్ టౌన్-1 ఏఈ సంగీత సెల్:9440811365, మహబూబాబాద్ టౌన్-2 ఏఈ కె.నవ్యశ్రీ సెల్:7901678236, మహబూబాబాద్ రూరల్ ఏఈ బోజ్యానాయక్ సెల్ : 9440811366, కేసముద్రం ఏడీఈ ఆర్.శ్రీనివాస్ సెల్ : 9440811334, ఏఈ కె.రాజు సెల్ : 9440811367, ఇనుగుర్తి ఏఈ ఏ.శశిధర్ సెల్ : 9059687550, గూడూరు ఏడీఈ కె.కవిత సెల్ : 9491703946, గూడూరు ఏఈ ప్రణీత్‌కుమార్ సెల్ : 9440811375, అయోధ్యపురం ఏఈ కె.అమ్ములు సెల్ : 7901678239, కొత్తగూడ ఏఈ డి.సురేష్ సెల్ : 9440811370, కురవి ఏడీఈ ఎ.రమేష్ సెల్ : 9440811335, కురవి ఏఈ బి.శారద సెల్ : 9440814853, సీరోలు ఏఈ జయప్రకాష్ నారాయణ సెల్ : 8639898537, డోర్నకల్ ఏఈ ఎం.కిరణ్ సెల్ :9440811368, గార్ల ఏఈ కె.మహేందర్‌బాబు సెల్ : 9440811550, కొత్తపేట ఏఈ బి.సుమన్ సెల్ : 9440811551లను సంప్రదించాలని విజయ్ సూచించారు.

మంత్రి తుమ్మలను కలిసిన బలరాంనాయక్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పాకాలగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన ఎంపీగా పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్, వెంకటేశ్వర్లు, వెంకట్రావ్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామసహాయం సురేందర్‌రెడ్డిని మహబూబాబాద్ ఎంపీగా గెలిచిన పోరిక బలరాంనాయక్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన తుమ్మల నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలను, నేతలను సమన్వయంతో ముందుకు నడిపించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ విజయంలో కీలకభూమిక పోషించారు. మానుకోట ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన బలరాంనాయక్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పాకాలగూడెం వెళ్లిమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్‌తో పాటు నాయకులు నూకల నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి : డీఎఫ్‌వో

నెహ్రూసెంటర్, జూన్ 5 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మహబూబాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) బి.విశాల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మానుకోట పట్టణంలోని మదర్‌థెరిస్సా సెంటర్ నుంచి జమాండ్లపల్లి అర్బన్ పార్కు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ పార్కు నందనవనంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణకు ముప్పు వాటిల్లకుండా పరిరక్షించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని చెప్పారు. అందరూ మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణమాచారి, జ్యోత్స్నదేవి, రాంమ్మూర్తి, బానోత్ సాంబునాయక్, రీనా, కిషన్‌రావు, నవీన్, రాములు, రవీందర్, లక్ష్మణ్, హరిసింగ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఫారెస్టు అర్బన్ పార్కులో మొక్కను నాటుతున్న విశాల్

'బడిబాట'కు వేళాయే..

నేటి నుంచి 19వ తేదీ వరకు కార్యక్రమం

- విద్యార్థుల నమోదు శాతం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ
- జిల్లాలోని అన్నిశాఖల సమన్వయంతో ముందుకు..
- 2023-24లో 3,054 మందికి ప్రవేశం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 5 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడానికి రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. గురువారం నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఇందులో భాగంగా 2024-25 విద్యాసంవత్సరంలో బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ఉదయం 7గంటల నుంచి 11వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఏ రోజు ఏ కార్యక్రమాలు చేపట్టాలో పొందుపరిచారు.బడిబాట విజయవంతానికి జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం మొదలగు సంక్షేమ పథకాలను బడిబాటలో విస్తృత ప్రచారం చేసి, విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు-676, ప్రాథమికోన్నత పాఠశాలలు-120. ఉన్నత పాఠశాలలు-102. మోడల్ స్కూల్స్-8, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు-15 మొత్తం 921 పాఠశాలలుండగా వాటిలో తెలుగు, హిందీ, ఉర్దూ మీడియంలలో 60,438 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

మూతబడిన స్కూళ్లను తెరిచేందుకు ప్రణాళిక..

మహబూబాబాద్ జిల్లాలోని 18మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 796 ఉండగా, అందులో 143బడుల్లో విద్యార్థుల్లేక గత విద్యాసంవత్సరం మూసివేయబడ్డాయి. ఆ పాఠశాలల ఉపాధ్యాయులను ఎక్కువ విద్యార్థులున్న బడులకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఈనెల 3నుంచి ప్రారంభం కానున్న బడిబాటలో డిప్యూటేషన్‌పై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్వంత పాఠశాలల పరిధి బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను నమోదుచేసి ఆ పాఠశాలను నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, ఏజెన్సీ ప్రాంత కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం, గార్ల, మహబూబాబాద్ మండలాల్లో 15 గిరిజన ఆశ్రమ పాఠశాలలు కూడా మూతబడి ఉన్నాయి.



అన్నిశాఖల అధికారులతో కమిటీ..

బడిబాట కార్యక్రమాన్ని జిల్లా, మండల, గ్రామస్థాయిలో విజయవంతం చేయడంతో పాటు బడీడు పిల్లలను స్కూళ్లల్లో చేర్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాస్థాయిలో

మిగతా 8వ పేజీలో..

విస్తృత ప్రచారంతో ముందుకు..

2023-24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన బడిబాటలో జిల్లా వ్యాప్తంగా 3,054 మంది విద్యార్థులకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 1వ తరగతిలో 1,169 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించగా, 2 నుంచి 10వ తరగతి వరకు 1885 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకున్నారు. కాగా, ఈ ఏడాది బడిబాటలో కూడా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను చేర్చుకోవాలనే లక్ష్యంతో విస్తృత ప్రచారం చేపట్టేందుకు ముందుకు సాగనున్నారు.

విద్యార్థుల నమోదు పెంపునకు బడిబాట

రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సర్కార్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కమిటీలతో ర్యాలీలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. బడీడు, బడిమధ్యలో మానేసిన పిల్లలు ఎవరు బడిబయట ఉండకుండా పాఠశాలల్లో చేర్పించేందుకు పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగనున్నాం.

మానుకోటలో కాంగ్రెస్ జోష్

● లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం ● ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా బీఆర్‌ఎస్ కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మళ్లీ పాగా వేసింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఓటర్లు కాంగ్రెస్‌కు జై కొట్టారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు జోష్‌లో ఉండగా.. ఇదే ఉత్సాహంతో రానున్న మునిసిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీలు, సహకార సంఘాల ఎన్నికలకు తామంతా సై అన్నట్టుగా అధిష్ఠానానికి సంకేతాలిస్తున్నారు. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలు ఉండగా 18 మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో పాటు 461 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిపై తిరిగి పట్టు సాధించేందుకు ఇప్పటి నుంచే గ్రామాలను శాసించే నాయకుల కోసం ముఖ్యనేతలు అన్వేషణ ప్రారంభించారు. తమతమ గ్రామాలు, పోలింగ్ బూత్‌లలో ఏ పార్టీకి ఎన్నిఓట్లు పోలయ్యాయి అనేది తెలుసుకునే దిశగా గణాంకాలు సేకరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

బీఆర్‌ఎస్‌ను కంగుతినిపించిన ఓటర్లు

పదేళ్లపాటు పాలించిన బీఆర్‌ఎస్‌పై ఉన్న అసంతృప్తి, మార్పు కావాలన్న ఆకాంక్ష నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క భద్రాచలం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో గులాబీ దండును కంగుతినిపించారు. దాని నుంచి తేరుకునే లోపే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా.. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాకల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పూర్తి పార్లమెంట్ నియోజకవర్గం హస్తం చేతిలోకి వెళ్లిపోయింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఏడు సెగ్మెంట్ల పరిధిలో కాంగ్రెస్‌కు 1,09,171 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 4,43,910 ఓట్లు, బీజేపీకి కేవలం 34,431 ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కలను బేరీజు వేసుకున్న బీజేపీ వ్యూహాత్మకంగా గతంలో బీఆర్‌ఎస్ ఎంపీగా పనిచేసిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు గాలం వేసి, పార్టీలో చేర్చుకుని ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపింది. బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మరోమారు రంగంలో దిగగా.. కాంగ్రెస్ పదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్‌నే అభ్యర్థిగా దించింది. ఆయన గత రెండు పర్యాయాలు ఓటమి పాలైనప్పటికి మూడోసారి ఆయనకే తిరిగి అవకాశం ఇచ్చింది. ప్రస్తుత పరిణామాల్లో పార్లమెంట్ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. మానుకోట పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366ఓట్లు ఉండగా 11,01,030ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 6,12,774ఓట్లు సాధించి 3,46,089 మెజారిటీతో విజయం సాధించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత 2,63,609 ఓట్లతో రెండోస్థానం, బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ 1,10,444ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. ఈ లెక్కల ప్రకారం గత పార్లమెంట్ ఎన్నికల నాటిని నేటికి కాంగ్రెస్ బలం భారీగా పెరగ్గా.. బీఆర్‌ఎస్ గ్రాఫ్ తీవ్రంగా పడిపోయింది. ఇక బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోగలిగింది.

జోష్‌లో హస్తం శ్రేణులు

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో వరించిన గెలుపు ఉత్సాహంతో మున్ముందు వరుసగా జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తహతహలాడుతున్నారు. పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ రెడీ టు ఫైట్ అంటున్నారు.

మానుకోట లోక్‌సభలో పోలైన ఓట్లు

అసెంబ్లీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
డోర్నకల్	95306	50293	9884
మహబూబాబాద్	102011	52128	17684
ఇల్లందు	92957	33658	12494
పినపాక	77430	28111	15170
భద్రాచలం	53637	19406	10294
ములుగు	86825	33592	19029
నర్సంపేట	100339	45228	24220
పోస్టల్ ఓట్లు	4269	1193	1669
మొత్తం	**6,12,774**	**2,63,609**	**1,10,444**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
డోర్నకల్	1,15,587	62,456	1,817
మహబూబాబాద్	1,16,644	66,473	17,038
ఇల్లందు	1,09,177	51,862	2566
పినపాక	90,510	56,004	2627
భద్రాచలం	47,533	53,252	1931
ములుగు	1,02,267	68,567	5388
నర్సంపేట	1,04,185	85,296	3062
మొత్తం	**6,85,897**	**4,43,910**	**34,431**

ముఖ్యమంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



హనుమకొండ సిటీ, జూన్ 5: వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. డీసీసీ బ్యాంక్ నిర్వహణ, ప్రగతి తదితర అంశాలను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి తెలియ చేశారు.

‘లోక్‌సభ’ పరీక్షలో మంత్రులు ఫెయిల్!

● ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు ● ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల రూపంలో వచ్చిన పరీక్షలో కాంగ్రెస్ మంత్రులు ఫెయిల్ అయ్యారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పొరుగు జిల్లాల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలు అప్పగించారు. దీంతో మంత్రులు సొంత నియోజకవర్గాలను వదిలి ఆయా లోక్‌సభ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించినా ఫలితం లేకుండా పోయింది. వరంగల్‌లో సీనియర్ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తొలుత లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కడియం కావ్య అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో అనూహ్యంగా ఆమెను వరంగల్ బాధ్యతల నుంచి తప్పించి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఆ బాధ్యతలను కాంగ్రెస్ అధిష్ఠానం అప్పగించింది. ఈ క్రమంలో అప్పటికే మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న సురేఖకు మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇచ్చారు. దీంతో సురేఖ లోక్‌సభ ఎన్నికల రాజకీయ వ్యూహాలపై దృష్టిపెట్టారు. అయినప్పటికీ మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఓటమిపాలయ్యారు. పైగా తన సొంత నియోజకవర్గం వరంగల్‌తూర్పులో బీజేపీకి ఆధిక్యం వచ్చింది.



అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆమె మూడు నెలలుగా ములుగు కంటే ఆదిలాబాద్‌లోనే ఎక్కువగా మకాం వేశారు. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటంతో సీతక్క తన చరిష్మాతో ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించి, పార్టీని గెలిపిస్తుందనే ఆశతో సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ బాధ్యతలను అప్పగించినా అక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలయ్యారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంతో పాటు పొన్నం సూచించిన వ్యక్తికే టికెట్ పార్టీ ఇచ్చింది. అయినా కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో పొన్నం కూడా పార్టీ పెట్టిన తొలి పరీక్షలో ఫెయిల్ అయ్యారనే చర్చ జరుగుతోంది. ఇక భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగించగా... ఇక్కడ మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే ఓరుగల్లు పరిధిలో ఉన్న నలుగురు మంత్రులకు కాంగ్రెస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తే ముగ్గురు మంత్రులు ఆశించిన స్థాయిలో రాణించలేదనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి.. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓరుగల్లు ఓటరు ఆలోచనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర, జాతీయ, స్థానిక రాజకీయ, సామాజిక సమీరణాలను బేరీజు వేసుకుంటున్న ఓటర్లు అనూహ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటున్నారనడానికి లోక్‌సభ పోరులో పార్టీలకు ఇచ్చిన ఓటు బ్యాంకును పరిశీలిస్తే అర్థమవుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా పోటాపోటీగా సాగిన పార్లమెంట్ పోరులో వరంగల్ స్థానం ‘చేతి’కి చిక్కినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు తగ్గిపోవడం శ్రేణుల్లో కలవరం రేపుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. బీజేపీ అభ్యర్థి అరూరిరమేష్ సొంత నియోజవర్గంలో కాంగ్రెస్‌కు ప్రజలు జై కొట్టడం లాంటి పరిణమాలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరగ్గా.. పట్టణ ఓటర్లు ఆ పార్టీని ఆదరించినట్టు అర్థమవుతోంది. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌వైపే నిలవగా.. వరుసగా మూడు సార్లు వరంగల్‌పై జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ ఈసారి చతికిలపడింది. రెండు అసెంబ్లీ స్థానాల్లో ద్వితీయస్థానం పొంది.. ఐదు నియోజకవర్గాల్లో తీవ్రంగా దెబ్బతిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటర్లు ‘చే’జారినా.. విజయం కాంగ్రెస్‌దే..

కాంగ్రెస్ విజయయాత్ర కొనసాగిస్తోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పది చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలచిన కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం పెరిగింది. ఇదే క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పట్టు సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,63,556 ఓట్లు పోలయ్యాయి. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 5,81,294ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చితే 82,262 ఓట్లు తగ్గాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి 1,06,690 ఓట్లు వస్తే ఈసారి 94,238 ఓట్లు వచ్చాయి. సుమారు 12వేల ఓట్లు తగ్గాయి. అలాగే భూపాలపల్లి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో 1,23,116 ఓట్లు కాంగ్రెస్ వస్తే, ఎంపీ ఎన్నికల్లో 89,463 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సుమారు 36వేలకు పైగా ఓట్లకు కోత పడింది. అలాగే పాలకుర్తిలో గతఎన్నికల్లో 1,26,848 కాంగ్రెస్‌కు పోలయితే ఈసారి కేవలం87,293 ఓట్లే పోలయ్యాయి. ఇక్కడ కూడా 38వేల ఓట్లు తగ్గాయి. మిగతా చోట్ల కూడా ఓట్లకు కోత పడింది. పరకాల, స్టేషన్‌ఘనపూర్‌లో కొంత ఓటింగ్ కాంగ్రెస్‌కు పెరిగింది. అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ అంచనాలకు మించి 2.20లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఈ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ జోష్‌గా పని చేసే అవకాశం లభించిందని కాంగ్రెస్ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు.

వరంగల్ తూర్పులో మంత్రికి షాక్..

లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌తూర్పు నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ ఓట్లు పోలవ్వటం హాట్ టాపిక్‌గా మారింది. తూర్పు నియోజకవర్గంలో 7,954ఓట్ల ఆధిక్యాన్ని బీజేపీ కనపర్చడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖకు 67,757ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావుకు 52,105ఓట్లు పోలయ్యాయి. 15,652 ఓట్ల మెజార్టీతో కొండా సురేఖ విజయం సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 66,627ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే 1,130ఓట్లు తగ్గాయి. అయితే బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 52,105 ఓట్లు మాత్రమే పోలయితే, ప్రస్తుతం 74,581ఓట్లు పోలయ్యాయి. 22,476ఓట్లు అధికంగా బీజేపీ రాబట్టుకుని, వరంగల్ తూర్పులో కాంగ్రెస్‌ను రెండోస్థానానికి పరిమితం చేసింది.

అనూహ్యంగా పుంజుకున్న కమలం

వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ భారీగా పుంజుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనుహ్యంగా 3,60,955ఓట్లు పోలయ్యాయి. అంటే 2,04,317 ఓట్లు అత్యధికంగా పెరిగాయి. అర్బన్ ఓటర్లు కూడా బీజేపీ వైపే మొగ్గు చూపారు. వరంగల్‌తూర్పులో కాంగ్రెస్‌ను దాటేసి ఓట్లను ఆధిక్యాన్ని సాధించింది. వరంగల్ పశ్చిమలో కూడా కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లను పొందింది. పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి సరైన క్యాడర్ లేకపోవటంతో ఇక్కడ మూడోస్థానానికి పరిమితమైంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో కేవలం 2,982 ఓట్లే రాగా, ఈ ఎన్నికలో 28,452 ఓట్లను రాబట్టింది. భూపాలపల్లిలో కూడా అనూహ్యంగా బీజేపీ పుంజుకుంది. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14731 ఓట్లే పోలయితే, ఈ ఎన్నికలో 49,631 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. పరకాలలో కూడా భారీగా ఓట్లను బీజేపీ సాధించింది. పాలకుర్తి సహ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి భారీగా ఓట్లు క్రాస్ అయ్యాయి.

వర్ధన్నపేటలో అరూరికి ఝలక్..

బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు తన సొంత నియోజకవర్గ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేష్ 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్‌కు 87,238 ఓట్లు పోలవగా.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నిలిచిన ఆయనకు కేవలం 55,427 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి.. ఇప్పటికి రమేష్‌కు 31,811ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 94,638ఓట్లు పోలయ్యాయి.

‘కారు’ పరిస్థితి మరీ దారుణం..

వరంగల్ లోక్‌సభ స్థానంలో 2014 నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో మరింత దారుణంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి బీఆర్ఎస్‌కు 5,03,298ఓట్లు పోలవగా.. ఈ ఎంపీ ఎన్నికల్లో కేవలం 2,32,033 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే సుమారు 2,71,265ఓట్లు ఆ పార్టీకి దూరమయ్యాయనే లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించినా బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం కావటం గులాబీ కేడర్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. వరంగల్ నగరంలోని వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు 20వేల ఓట్లు కూడా పోలవ్వలేదు. అలాగే భూపాలపల్లి, పరకాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు పొంది రెండోస్థానంలో నిలిచిన బీఆర్ఎస్ ఈ ఎన్నికలో నామమాత్రంగా పోటీ ఇవ్వడంపై కార్యకర్తల్లో ఆందోళన కనిపిస్తోంది. అయితే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో మాత్రమే బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చాలా వరకు బీజేపీకి, అక్కడక్కడ కాంగ్రెస్‌కు క్రాస్ అయిందనే చర్చ జరుగుతుండగా.. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	98,145	40,332	43,720
పాలకుర్తి	87,293	28,452	47,878
పరకాల	76,400	44,841	36,477
వరంగల్ పశ్చిమ	63,400	60,611	19,680
వరంగల్ తూర్పు	66,627	74,581	20,360
వర్ధన్నపేట	94,238	57,427	31,345
భూపాలపల్లి	89,463	49,631	31,360
పోస్టల్	5,728	5,080	1,213
మొత్తం	5,81,294	3,60,955	2,32,033

గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	93,917	4,984	1,01,696
పాలకుర్తి	1,26,848	2,982	79,214
పరకాల	72,573	38,735	64,632
వరంగల్ పశ్చిమ	72,649	30,826	57,318
వరంగల్ తూర్పు	67,757	52,105	42,783
వర్ధన్నపేట	1,06,696	12,275	87,238
భూపాలపల్లి	1,23,116	14,731	70,417
మొత్తం	6,63,556	1,56,638	5,03,298

శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలైనా!

• ప్రారంభం కాని మరిపెడ 100 పడకల ఆస్పత్రి పనులు



మరిపెడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



మరిపెడలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

మరిపెడ, జూన్ 5 : ఆరోగ్యమే మహాభాగ్యం.. అందరికీ వైద్యం అందించాలన్న లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ సర్కారు ఆస్పత్రులను నిర్మించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా 2023 సెప్టెంబరు 28న మరిపెడలో 100 పడకల ఆస్పత్రికి అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆస్పత్రి ఏర్పాటుకు శ్రీకారం జరిగి 8 నెలలు గడిచినా.. పనులు జరిగిన దాఖలాలు లేవు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆస్పత్రిని మంజూరు చేసి, టెండర్లను ఆహ్వానించకపోవడంతో ఎన్నికల స్టంట్ అని ప్రజలు వాపోతున్నారు.

ఖమ్మం- సూర్యాపేట- మహబూబాబాద్ జిల్లాలకు మరిపెడ మునిసిపల్ కేంద్రం సరిహద్దు కావడంతో వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం గడుపుతున్నారు. ఏ చిన్న రోగం, నొప్పి వచ్చినా ఖమ్మం-సూర్యాపేట-మహబూబాబాద్ జిల్లా కేంద్రాలలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తారు. ఈ క్రమంలో మరిపెడ పట్టణంలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నారని తెలిసి ఇక్కడి ప్రజలు ఎంతో మురిసిపోయారు. కానీ, పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

24 గంటలు రోగులకు వైద్యం..

జిల్లాల సరిహద్దున ఉన్న మరిపెడ మున్సిపాలిటీలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుతో 24 గంటల వైద్య సేవలు అందుతాయని ప్రజలు హర్షతిరేకాలు వ్యక్త పరిచారు. ప్రత్యేక వైద్య నిపుణులు (హార్ట్, బోన్స్, గైనాకాలజిస్ట్, ముక్కు, చెవి, గొంతు, ఎండీ జనరల్, ఎంఎస్ స్పెషలిస్ట్), అన్నిరకాల పరీక్షల విభాగాలు (ఎక్స్‌రే, ల్యాబ్, ఈసీజీ, స్కానింగ్, సిటి స్కాన్, ఇతర టెస్టులు) ఏర్పాటుతోపాటు పదుల సంఖ్యలో డాక్టర్లు, వందల సంఖ్యలో సిబ్బంది ఉంటారని అనుకున్నారు. కానీ, ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలు గడిచినా నిర్మాణ పనులు నేటికి జరుగకపోవడంతో ప్రజలంతా నైరాశ్యంలో మునిగిపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం గుర్తించి మరిపెడ 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగతిన చేపట్టాలని పేద, బడుగు, బలహీన వర్గాల వారు కోరుతున్నారు.

ఏ చిన్న జబ్బు వచ్చినా ఇబ్బందే..

- బానోత్ తొడికి, కూన్యాతండా మరిపెడ



ఏ చిన్న జబ్బుచేసినా వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నాం. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేటకు ఆటోలు బాడుగకు తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి. మరిపెడబంగ్లాలో పెద్దఆస్పత్రి శంకుస్థాపన చేస్తే ఎంతో మురిసిపోయాం. కాలం గడుస్తున్న ఇంక పనులు లేవు.

సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతా..

- డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిండు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు పది రోజుల ముందు అప్పటి ప్రభుత్వం ఓట్ల కోసం డ్రామాలు చేసింది. పదేళ్లలో లేని సోయి అప్పుడే వచ్చి ఓట్ల కోసం మరిపెడలో 100 పడకల ఆస్పత్రికి అత్రంఆత్రం చేశా రు. రూ.36 కోట్లు విడుదల చేశామని చెప్పి టెండర్లను పిలువలే. అయినప్పటికి ఓ డాక్టర్‌గా తాను ఇక్కడి ప్రజల ఇబ్బందులు ఎరిగినోన్ని తప్పకుండా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మరిపెడ 100 పడకల ఆస్పత్రిని నిర్మించేలా తన వంతు కృషి ఉంటుంది.

ఆస్పత్రి ప్రాసెస్‌లోనే ఉంది..

• డాక్టర్ వెంకట్రాములు, జిల్లా వైద్యవిధాన పరిషత్ సూపరింటెండెంట్

మరిపెడ 100 పడకల ఆస్పత్రి ప్రాసెస్‌లోనే ఉంది. ఈ ఆస్పత్రి నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు అయ్యాయి. ఆస్పత్రి నిర్మాణ పనులకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. శంకుస్థాపన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

• బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలుమాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, జూన్5 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాతీర్పుకు శిరసావహిస్తామని మానుకోట బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలిచిందని చెప్పారు. ఐదేళ్లు పార్లమెంట్‌లో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీతో పాటు ఇతర సమస్యలపై గళమెత్తానని తెలిపారు. గెలిచిన, ఓడిన ప్రజా క్షేత్రంలో ఉంటానని, గెలిస్తే పొంగిపోయేది లేదని, ఓడితే కుంగిపోయేది లేదన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఎవరూ అధైర్య పడవద్దని అందరికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం పనిచేసిన నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు, తనకు ఓటువేసిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల పక్షాన పోరాడుతాం : ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం తాము ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తామని, ఫలితాలపై సమీక్షించుకుంటామని చెప్పారు. ఐదేళ్ల పాటు ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి,యాకూబ్‌రెడ్డి, మంగలంపల్లి కన్న, తేళ్ల శ్రీనివాస్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, ముత్యం వెంకన్న, బోడ లక్ష్మణ్, ఇనుగుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై విజిలెన్స్, పోలీసుల దాడులు

• రెండు ఎక్స్‌కవేటర్లు, ఐదు ట్రాక్టర్లు సీజ్

బయ్యారం, జూన్ 5 : మండలంలో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు, స్థానిక పోలీసులు బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు ఎక్స్‌కవేటర్లతో పాటు ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అధి కారులు పేర్కొన్నారు. బయ్యారం పెద్దచెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ సీఐ అనిల్ నేతృత్వంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ రైడ్‌లో ఒక ఎక్స్‌కవేటర్, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, మట్టిని తరలిస్తున్న నిర్వాహకులకు ప్రాపర్‌గా సరైన అనుమతులు పొం దారా..! మట్టిని తీసేందుకు ఏ ప్రాంతంలో అనుమతులు పొందారు.. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకున్నారు.. సరైన పత్రాలు సమర్పించారా..! లేదా? అన్న దానిపై పూర్తిస్థాయి తనిఖీ నిమిత్తం సంబంధిత మైనింగ్ శాఖకు లికిత పూర్వకంగా అభ్యర్థించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ అనిల్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఉప్పలపాడు పంచాయతీ పరిధిలో సైతం అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రైడ్‌చేసి ఒక ఎక్స్‌కవేటర్‌తో పాటు నాలుగు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు బయ్యారం సీఐ రవికుమార్ తెలిపారు. దీనిపై ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేందుకు అసోసియేషన్ ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 : క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకే అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్టఫర్‌బాబు అన్నారు. మాధవాపురంలో బుధవారం వరంగల్ ఒలంపిక్స్ పరిశీలకుడు టి.శ్యాంప్రసాద్, కందుల దర్గయ్య ఆధ్వర్యంలో కబడ్డీ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాధవాపురానికి చెందిన మద్ది వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కంబాలపల్లికి చెందిన సంద వీరన్న, ఉపాధ్యక్షుడిగా తోట యాకాంబ్రం, గంధసిరి శ్రీనివాస్, గుంటుక కుమారస్వామి, బాదె శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బానోత్ చాంప్లానాయక్, సురేందర్, యాకన్న, అనిల్, కోశాధికారిగా ఈసం స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా గుగులోతు శ్రీను, మహ్మద్ ఇమామ్, రాములు, శ్రీరాం, శ్రీను, అవినాష్, యాదగిరి, అఖిల్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రిష్టఫర్‌బాబు మాట్లాడుతూ 2020 నుంచి 2024 సంవత్సరంలో తెలంగాణలో జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించామని చెప్పారు. జిల్లాస్థాయి బాలబాలికలకు కబడ్డీ పోటీలను తొర్రూరులో నిర్వహించామని చెప్పారు. 2023లో కబడ్డీ క్రీడాకారుడు బీసు యాకన్న హర్యానాలో జరిగిన జాతీయస్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అసోసియేషన్ ద్వారా కబడ్డీలో నైపుణ్యం ఉన్న అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

'బడిబాట'కు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

అన్నిశాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి, మునిసిపల్ కమిషనర్, మెప్మా పీడీ, డీఆర్‌డీవో, లేబర్ అధికారి, డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా సంక్షేమాధికారి, జిల్లా మహిళాసమాఖ్య అధ్యక్షురాలు, ఎన్‌జీవో ప్రతినిధి ఉంటారు. మండల కమిటీలో ప్రత్యేకాధికారిచైర్మన్‌గా, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, గ్రామ కమిటీలో ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, మహిళా సమాఖ్య సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఆశావర్కర్లు సమన్వయంతో విజయవంతం చేయనున్నారు. గ్రామాలు, తండాల్లో బ్యానర్లతో ర్యాలీలు నిర్వహించి ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. పాఠశాల హెచ్‌ఎం గ్రామ విద్యాపరిరక్షకుడిగా 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను బడిలో చేర్పించడంతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సైతం విద్యయొక్క ప్రాముఖ్యతను వివరించనున్నారు. బడిబాటలో భాగంగా ప్రతీఇంటిని సర్వేచేసి బడిమానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో పూర్తి వివరాలను పొందుపరచనున్నారు.

రోజువారీగా కార్యక్రమాలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడానికి గురువారం (నేటి) నుంచి ఈనెల 19వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వం విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు గ్రామాలు, తండాల్లో ప్రచారం నిర్వహించేందు కు బడిబాట కార్యక్రమం షెడ్యూల్ విడుదల చేసింది.

- 6న స్కూళ్లల్లో నమోదు శాతాన్ని పెంచేందుకు విలేజ్ ఆర్గనైజేషన్స్ (వీవో), ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఏ విధమైన చర్యలు చేపట్టాలి. ర్యాలీలు, స్వయం సహాయక సం ఘాలు, ఏపీసీ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవో, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి.
- 7న విద్యార్థుల ఆధార్ సేకరణ, కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం. బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చైతన్యపర్చడం. బడికి వెళ్లే పిల్లల వివరాలను విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో (వీఈఆర్) నమోదు చేయాలి.
- 8 నుంచి 10 వరకు ప్రతీ ఇంటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శన, తల్లిదండ్రులను కలిసి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించడం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను కరపత్రాలు, బ్రోచర్స్ రూపంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం. బడి మధ్యలో మానేసిన బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించుట.
- దివ్యాంగ పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న వైద్యసేవలపై తల్లిదండ్రులకు వివరించడం. పాఠశాలలకు వెళ్లకుండా ఇంటివద్ద ఉంటున్న గుర్తించిన పిల్లలను పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం.
- 11న ఈనెల 6 నుంచి10 వరకు చేపట్టిన బడిబాట కార్యక్రమాలపై గ్రామ సభ నిర్వహించడం.

12 నుంచి 19 వరకు ఇలా..

బడిబాటలో గుర్తించిన బడిమానేసిన పిల్లలను జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం రోజున చేర్పించడం. అదేరోజు పాఠశాలలను వివిధ అలంకరణలతో ముస్తాబు చేసి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వాగతం పలకడం. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఉచిత యూనిఫాం పంపిణీ చేయాలి.

- 13న విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించడం, విద్యాప్రమాణాలు పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం.
- 14న ప్రాథమిక పాఠశాలల్లో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులచే సామూహిక అక్షరభ్యాసం చేయించడం. హైస్కూల్స్‌లో బాలసభలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను వివరించడం.
- 15న ప్రత్యేక అవసరాలు (దివ్యాంగ)గల రోజు, బాలికల చైల్డ్ విద్యా దినోత్సవం నిర్వహించడం. బాలికల విద్య ప్రాముఖ్యత, భవిష్యతపై అవగాహన కల్పించడం.
- 18న డిజిటలైజేషన్ బోధన, మొక్కల పెంపకదినోత్సవ వేడుకలపై అవగాహన కల్పించడం.
- 19న స్కూళ్లల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం. దీంతో బడిబాట కార్యక్రమం పూర్తవుతోంది.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జడ్జిలు తిరుపతి, మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర పద్మాకర్‌రెడ్డి, జీపీ వెంకటయ్య, వెంకట స్వామి, జిల్లా కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్, సూపరింటెంట్ అమరేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

• తొర్రూరు : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తొర్రూరు మునిసిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ రాజు, న్యాయవాదులు శ్రీశైలం, బి.వెంకన్న, జి.రామకృష్ణ ఉన్నారు.

నేడు డోర్నకల్‌కు డీఆర్‌ఎం రాక

డోర్నకల్, జూన్ 5 : దక్షిణ మధ్యరైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) బర్తేష్‌కుమార్ జైన్ గురువారం డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో పర్యటించనున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలుద్వారా మధ్యాహ్నం డోర్నకల్‌కు చేరుకుని రైల్వే రన్నింగ్‌రూం, క్రూబుకింగ్ లాబీలను పరిశీలించనున్నారు. అనంతరం ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడోలైనుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది. డీఆర్‌ఎం పర్యటన ఉండడంతో రైల్వే సిబ్బంది అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు'

బయ్యారం, జూన్ 5 : ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలను ఆసరగా మలుచుకొని నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు డీలర్లను హెచ్చరించారు. బయ్యారంలో బుధవారం మన గ్రోమోర్, ఆగ్రో స్ రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగం గా స్టాక్ రిజిస్ట్రర్లు, ధర పట్టికలు తదితర మెయింటెన్స్ రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఎంఏవో రాంజీ నాయక్, ఏఈవోలు పాల్గొన్నారు.

'నైతిక విజయం ఇండియా కూటమిదే'

మహబూబాబాద్ టౌన్, జూన్5 : పార్లమెంట్ ఎన్నికల్లో నైతిక విజయం ఇండియా కూటమిదేనని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపిం చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపిల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, నర్రా శ్రావణ్, శ్రావణ్, రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

చిన్నగూడూరు, జూన్ 5 : ఉగ్గంపల్లిలో కొలువు దీరిన గ్రామ దేవత బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం గ్రామ దేవతలను అలంకరించి, అర్చకుడు మధుశాస్త్రి వేద మంత్రాలతో గణపతి పూజ నిర్వహించారు. ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. గురువారం శ్రీరామలింగేశ్వర కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గ్రామదేవతల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలి

• డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష్

బయ్యారం, జూన్ 5 : సహజంగా వర్షాకాలంలో సంబవించే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు ముందుస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బయ్యారం మండలం గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 వారాల్లో గర్భిణీ స్త్రీల నమోదు కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు నూరు శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ఆశాలందరు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కీటక జనత వ్యాధులైన మలేరియా, డెంగ్యు, ఫైలేరియా, చికెన్‌గునియా, వ్యాధులను అరికట్టేలా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

గూడూరు, జూన్ 5 : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన పోరిక బలరాంనాయక్‌ను గూడూరు కాంగ్రెస్ శ్రేణులు మహబూబాబాద్‌లో బుధవారం కలిశారు. బలరాంనాయక్‌కు శాలువాలు, పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గూడూరు మండలం నుంచి భారీ మెజార్టీ ఇచ్చినట్లు గూడూరు కాంగ్రెస్ నాయకులు బలరాంనాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుడిగే సతీష్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తిస్వామి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యాకూబ్‌పాషా, కన్నెబోయిన వెంకన్న, అవుల అశోక్, విష్ణు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిచాలి : హెచ్‌ఎం

గూడూరు, జూన్ 5 : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తాళ్లపాటి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సోమ రవి అన్నారు. గూడూరు మండలం తాళ్లపాటి తండాలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలిసి పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంచితేనే మానవ మనుగడకు ముప్పు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

కేసముద్రం, జూన్ 5 : కేసముద్రం మండలం ఎస్టీకాలనీలో బుధవారం యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో మొక్కలు నాటాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకాంత్, మోహన్, జి.నరేష్, కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ టీచర్ సరోజనదేవి, శిరీష, సురేష్, వీరు, నరేష్, రవి పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా గుర్తించాలి

మహబూబాబాద్ టౌన్, జూన్ 5: అడవులు అంతరించి రోజు రోజుటకు పర్యావరణం దెబ్బతింటున్న తరుణంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం తమ బాధ్యతగా గుర్తించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సమన్వయకర్త సోమ విష్ణువర్ధన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. పర్యావరణం దెబ్బతిని, ఓజోన్‌పొర పలుచని రూపం దాల్చడంతో ఎండలు తీవ్రంగా పెరిగి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యాయరని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, మైస శ్రీనివాసులు, పట్టాభి లక్ష్మయ్య హట్యానాయక్, మధూసూదన్, దామోదర్, విద్యాసాగర్,మహేందర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, మహ్మద్‌అలీ, వెంకటేశ్వర్లు, యాకయ్య, రాధాకృష్ణరవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి గెలుపులో పవన్‌కల్యాణ్ పాత్ర

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెం ట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించారని మెగాస్టార్ చిరంజీవి, రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు దాసరి రావిష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసి వంద శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీతో గెలుపొందడం హర్షనీయమన్నారు.

గ్రూపు-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

• అదనపు ఎస్పీ చెన్నయ్య



పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న చెన్నయ్య

మహబూబాబాద్ఎడ్యుకేషన్, మే5 : జిల్లాలో ఈనెల 9న నిర్వహిం చనున్న గ్రూపు-1 ప్రిలిమినరి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య అన్నారు. మానుకోట పట్టణంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రూపు-1 నిర్వహణపై చీఫ్ సూపరింటెంట్‌లు, బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునే సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్షల నిర్వహణ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సీటింగ్ ప్లాన్, సిబ్బంది విధుల నిర్వహణ, సమయ పాలన మొదలగు విషయాలపై అధికారులకు సూచించారు. ఈ శిక్షణలో 12 మంది చీఫ్ సూపరిండెంట్‌లు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లు, అధికారులు సీఐ సత్య నారాయణ, ఎస్సై దిలీప్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



బాణాసంచా కాల్చుతున్న బీజేపీ శ్రేణులు

కేసముద్రం, జూన్5 : దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పా టు చేయనుండడంతోహర్షం వ్యక్తం చేస్తూ కేసముద్రంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి వేలం శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చులక్ష్మీనారాయణ, ఉప్పు నూతల రమేష్, మధు, నవనీత్, ఎలబోయిన కరుణాకర్, మంగిశెట్టి నాగయ్య, ఐలయ్య, సురేష్, నాగరబోయిన చంద్రకళ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి 15వేల ఆర్థిక సాయం

ఇనుగుర్తి, జూన్ 5 : ఇటీవల జరిగిన ఛత్తీస్‌ఘడ్ రోడ్డు ప్రమాదంలో ఇనుగుర్తి గ్రామానికి చెందిన షబ్బీర్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా గ్రానైట్ లారీ డ్రైవర్‌యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఇనుగుర్తికి చేరుకుని షబ్బీర్ కుటుంబసభ్యులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ షబ్బీర్ మృతిచాలా బాధకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ లారీడ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు బండారు మధుకర్‌గౌడ్, రాజు, శ్రీను, ఉపేందర్‌రావు, అన్వేష్, ఉపేందర్, సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోటో :05జీడీఆర్01-మహబూబాబాద్‌లో ఎంపీగా గెలుపొందిన బలరాంనాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న గూడూరు కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

• ఎంఈవో గుగులోత్ రాము

నెల్లికుదురు, జూన్ 5 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుదని ఎంఈవో గుగులోత్ రాము తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయలంలో బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్నభోజనం అందింస్తున్నామని, తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రాందాస్, ఎంఐఎస్ కోఆర్డీనేటర్ మస్కుపురి సుధాకర్, హెచ్.ఉపేందర్, సీఆర్పీలు ఏ.భాస్కర్‌రావు, బి.వీరస్వామి, బి.కవిత, జె.కవిత, యాకయ్య పాల్గొన్నారు.

విచారణ చేపట్టిన ఏఈవోలు

తొర్రూరు, జూన్ 5 : ప్రభుత్వం సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించాల్సి ఉండగా వారిపేర్లతో ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారనే నేపథ్యంలో మండల వ్యవసాయాధికారికి మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు మెమో జారీ చేశారు. బుధవారం వ్యవసాయశాఖ ఏఈవోలు తొర్రూరులోని ఆగ్రోస్ కేంద్రాలు, పీఏసీఎస్ సొసైటీల దుకాణాల సముదాయాల్లో పచ్చిరొట్ట విత్తనాల విక్రయాల రికార్డులు, రశీదు పుస్తకాలను పరిశీలించి వివరాలు సేకరించారు. దీనిపై ఏఈవోలను వివరణ కోరగా, సంబంధిత వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.